ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
శనివారం, 24 అక్టోబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 61 | పేజీలు: 4 వెల: 5

## తిరకాసులు



- రికార్డుల్లో ఒకటి.. క్షేత్రస్థాయిలో మరొకటి!
- ఫిర్యాదులు చేసినా పరిష్కారం కాని సమస్యలు
- సర్వేలు, పట్టాదారు పత్రాల చుట్టూ వివాదాలు
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు
- ప్రభుత్వ భూముల పరిరక్షణపై తలెత్తుతున్న ప్రశ్నలు
- భూ రికార్డుల పరిశీలనతోనే అక్రమాల గుట్టురట్టు!

3

## గాడి తప్పిన టౌన్ ప్లానింగ్

కరీంనగర్ నగరంలో భవన నిర్మాణాల తీరుపై చర్చ జరుగుతోంది. నిర్మాణ అనుమతులు, ఆమోదించిన ప్రణాళికలు, క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనుల మధ్య వ్యత్యాసాలుంటున్నాయి. అనుమతించిన అంతస్తులకు మించి నిర్మాణాలు చేపట్టడం, సెల్లార్లను ఇతర అవసరాలకు వినియోగించడం, పార్కింగ్ స్థలాల్లో మార్పులు చేయడం వంటి ఉల్లంఘనలు జరుగుతున్నాయి. నగరంలో బహుళ అంతస్తుల భవనాలు పెరుగుతున్న నేపథ్యంలో నిర్మాణ అనుమతుల అమలు, అధికారుల తనిఖీలు, ఉల్లంఘనలపై చర్యలు కీలకంగా మారాయి. కరీంనగర్ నగరంలో భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకునే సమయంలో సమర్పించిన ప్రణాళికలకు అనుగుణంగానే నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ విషయం అధికారుల తనిఖీల్లో బయటపడుతున్నా.. నామమాత్రపు జరిమానాలు, నోటీసులతో మమ అనిపించేస్తున్నారు. ఆమోదించిన అంతస్తుల సంఖ్యకు మించి నిర్మాణాలు చేపట్టడం, భవన విస్తీర్ణాన్ని పెంచడం, అదనపు గదులు నిర్మించడం వంటి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వస్తున్నాయి. భవన నిర్మాణ అనుమతులు, ఆమోదిత ప్రణాళికలు, క్షేత్రస్థాయి కొలతలను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి వెల్లడవుతుంది. - కాకతీయ, కరీంనగర్



- అక్రమ నిర్మాణాలకు అడ్డాగా కరీంనగర్!
- అనుమతులకు మించి భవన నిర్మాణాలు
- సెల్లార్లు, పార్కింగ్ స్థలాల వినియోగంలో ఉల్లంఘనలు
- భవన నిర్మాణ నిబంధనలకు తూట్లు
- నగరంలో పెరుగుతున్న అక్రమ నిర్మాణాలు
- నోటీసుల జారీతోనే అధికారులు సరిపెడుతున్నారా?

2

## పైసా వసూల్..!

- రంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వసూళ్ల పర్వం
- దళారులు, డాక్యుమెంట్ రైటర్ల కనుసన్నల్లో రిజిస్ట్రేషన్లు
- నిషేధిత భూములు, పార్కు స్థలాలకు రిజిస్ట్రేషన్లు..?!
- ఏసీబీ దాడులు జరుగుతున్నా.. మారని అధికారుల తీరు..!
- ఏటా రూ.3 వేల కోట్ల ఆదాయం వచ్చే జిల్లాలో అక్రమాలపై విచారణ ఏదీ?



2

ఛాయా సోమేశ్వరాలయానికి
## మహర్దశ!

- ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు
- యునెస్కో గుర్తింపు దిశగా కృషి చేస్తా : మంత్రి కోమటిరెడ్డి
- సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, జూపల్లికి కృతజ్ఞతలు



2

- వచ్చే జూలై వరకు తాగునీటి కష్టాలు తప్పవు
- కరువు ప్రభావాన్ని దాచిపెడితే క్యాన్సర్‌ను దాచినట్లే
- విద్యుత్ కొనుగోలుకు సిద్ధంగా ఉన్నా మార్కెట్‌లో లభ్యత లేదు
- సంక్రాంతి నుంచి మే వరకు గ్రామాల్లో ఉపాధి కల్పనకు ప్రత్యేక కార్యాచరణ
- ప్రజాప్రతినిధులంతా గ్రామాల్లోనే ఉండాలి.. నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం



# ఎల్‌నినోను ఎదుర్కొందాం

### ప్రజలను అప్రమత్తం చేద్దాం!

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గి, సాగు, తాగునీటి కొరత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. వచ్చే జూలై వరకు తాగునీటి ఇబ్బందులు కొనసాగే అవకాశం ఉందని, ఎండ తీవ్రత పెరిగే కొద్దీ పరిస్థితులు మరింత కఠినంగా మారతాయని చెప్పారు. కరువు ప్రభావం మొదట్లో పెద్దగా కనిపించకపోయినా.. క్రమంగా తీవ్రరూపం దాల్చుతుందని వివరించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని, సమస్యలను దాచిపెట్టకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును నోడల్ అధికారిగా నియమించామని వెల్లడించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ పొదుపు, పశుసంపద పరిరక్షణ, రైతులకు అవగాహన, ఉపాధి కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. శుక్రవారం మంత్రివర్గ భేటీలో ఎల్‌నినో పరిస్థితులు..కార్యాచరణపై సీఎం సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.

**ఆరు నెలలుగా అప్రమత్తం చేస్తున్నాం**

ప్రకృతి వైపరీత్యాల్లో వరదలు, కరువు, భూకంపాలు ప్రధానమైనవని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భూకంపాలు క్షణాల్లో భారీ నష్టాన్ని కలిగిస్తాయని, వరదలు, సునామీల విషయంలోనూ తక్కువ వ్యవధిలోనే ప్రమాదం ముంచుకొస్తుందని చెప్పారు. కరువు మాత్రం నెమ్మదిగా విస్తరిస్తూ ప్రజల జీవనాన్ని దెబ్బతీస్తుందని వివరించారు. అందుకే ఆరు నెలలుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం

........(తరువాయి 2లో)

## క్వారీల్లో కాసుల వేట!

- భూపాలపల్లిలో ఇసుక తవ్వకాల మాటున అక్రమాలు
- లోడింగ్ వద్ద అదనపు వసూళ్ల దందా
- అనుమతులున్నా.. పర్యవేక్షణలో డొల్లతనం
- ఇసుక రవాణాలో నిబంధనలకు తూట్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్న వైనం
- రీచ్‌ల నిర్వహణపై కొరవడిన నియంత్రణ

2



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇసుక క్వారీల నిర్వహణపై అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తవ్వకాల నుంచి లారీల లోడింగ్, రవాణా వరకు సాగుతున్న వ్యవహారాలపై ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఇసుక రీచ్‌ల నిర్వహణలో నిబంధనలు అమలు కావాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో అదనపు వసూళ్లు, తవ్వకాల పరిమాణం, రవాణా లెక్కలపై వివాదాలు తలెత్తుతున్నాయి. లారీల లోడింగ్ సమయంలో నిర్ణీత మొత్తానికి మించి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కొనుగోలుదారులపై భారాన్ని పెంచుతున్నాయి. మరోవైపు, తవ్విన ఇసుక పరిమాణం, విక్రయాల లెక్కలు, ప్రభుత్వానికి జమవుతున్న ఆదాయంపై పూర్తి వివరాలు అందుబాటులో లేకపోవడంతో క్వారీల నిర్వహణ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. - కాకతీయ, తెలంగాణ బ్యూరో

## తహసీల్దార్ సంతకం, ముద్ర ఫోర్జరీ

- నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్‌తో భూముల మ్యుటేషన్‌కు యత్నం!
- కరీమాబాద్ మహిళపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు
- దర్యాప్తు చేపట్టిన ఏజే మిల్స్ కాలనీ పోలీసులు

4




## భద్రతే అభివృద్ధికి పునాది!

- రాష్ట్రంలోని 67 కీలక సంస్థలకు రక్షణ..
- దాదాపు 2 వేల మంది సిబ్బందితో భద్రత
- ఆధునిక సాంకేతికతతో భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయాలి
- తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం 35వ ఆవిర్భావ దినోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి

**కాకతీయ, హైదరాబాద్:** తెలంగాణ ప్రగతిలో ప్రత్యేక రక్షణ దళం పాత్ర కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భద్రతే అభివృద్ధికి పునాది అని, ప్రభుత్వ సంస్థలు నిరంతరాయంగా పనిచేసేందుకు భద్రతా సిబ్బంది సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం 35వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని 67 కీలక సంస్థలకు దాదాపు 2 వేల మంది సిబ్బందితో రక్షణ కల్పిస్తున్న ప్రత్యేక రక్షణ దళం సేవలు ప్రశంసనీయమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. 'ప్రగతికి రక్షణ' అనే నినాదం ఎంతో అర్థవంతమైనదని అన్నారు. యాదాద్రి, కొత్తగూడెం, భద్రాద్రి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల భద్రతలో ప్రత్యేక రక్షణ దళం కీలక పాత్ర పోషిస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజలకు వెలుగులు అందించే విద్యుత్ కేంద్రాలను కాపాడుతున్న సిబ్బంది కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. భవనాలు, సంస్థలకు రక్షణ కల్పించడమే కాకుండా ప్రజల విశ్వాసాన్ని కాపాడుతున్నారని పేర్కొన్నారు.

**ఆధునిక సాంకేతికతపై పట్టు అవసరం**

డ్రోన్లు, కృత్రిమ మేధ, సైబర్ సాంకేతికతతో భద్రతా రంగంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని

........(తరువాయి 2లో)

### ఫేక్ పెట్టుబడుల సమ్మిట్‌ను

# అడ్డుకుంటాం

### గత పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో సత్తా చాటుతాం
- తాగునీరు, రోడ్లు ఇవ్వలేని ప్రభుత్వం విశ్వనగరం అంటోంది
- యువతకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ధ్వజం
- హైదరాబాద్‌పై తెలంగాణ రక్షణ సేన రణభేరి!



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్‌లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేని కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వనగరం పేరుతో ప్రచారం చేసుకుంటోందని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత విమర్శించారు. గత పెట్టుబడుల సదస్సుల ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిసెంబరులో

........(తరువాయి 3లో)

# ఎల్‌నినోను ఎదుర్కొందాం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణకే పరిమితం కాలేదని, ఇంగ్లండ్, అమెరికా వంటి దేశాలతో పాటు మహారాష్ట్ర సహా దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ నీటి కొరత కనిపిస్తోందని చెప్పారు. మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో నీటి రేషన్ అమలు చేస్తున్న పరిస్థితులు ఉన్నాయని ప్రస్తావించారు. తెలంగాణలోనూ తాగునీటి సమస్య తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, భూగర్భ జలాలు తగ్గిన ప్రాంతాల్లో బోర్లు నడిచినా పంటలకు సరిపడా నీరు అందకపోవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ భూగర్భ జలాలు లేనప్పుడు పంటలు సాగు చేస్తే రైతులు పెట్టుబడి నష్టాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు పరిస్థితిని అర్థం చేసుకొని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వచ్చే వానాకాలంలో మంచి పంటలు పండించుకునే అవకాశాలపై ఆశాభావం వ్యక్తం చేశారు.

**తాగునీటికి ప్రత్యేక కార్యాచరణ**

హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంత్రివర్గ ఉపసంఘంతో పాటు అన్ని స్థాయుల్లో అధికారులు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు నీటి సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి, అందులో నమోదయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించే వ్యవస్థ ఉండాలని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంపై ప్రతిరోజూ బులెటిన్ విడుదల చేస్తామని, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు రోజువారీ సమాచారాన్ని అందిస్తారని వెల్లడించారు.



ప్రజలకు సరైన సమాచారం చేరేలా కాంగ్రెస్ పార్టీ తరఫున గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు కూడా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కరువు పరిస్థితులను దాచిపెట్టడం క్యాన్సర్ వ్యాధిని దాచిపెట్టడంతో సమానమని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సమస్య తీవ్రతను ప్రజలకు వివరించి, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని చెప్పారు. ఎండ తీవ్రత, వడదెబ్బ నుంచి ప్రజలను కాపాడేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశుసంపదను సంరక్షించేందుకు పశుగ్రాసం, నీటి వసతులు కల్పించాలని, రైతు వేదికల్లో వారానికోసారి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అభినందించారు.

**విద్యుత్‌కు తీవ్ర కొరత.. పొదుపే మార్గం**

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఉమ్మడి రాష్ట్రంలోనూ లేనంతగా పెరిగిందని ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైన విద్యుత్‌ను ఎంత ఖర్చయినా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, మార్కెట్‌లో తగినంత విద్యుత్ అందుబాటులో లేని పరిస్థితి ఉందన్నారు. బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి విద్యుత్ కొనుగోలు చేయడానికి ప్రయత్నించినా సరఫరా లభ్యత సమస్యగా మారుతోందని వివరించారు. విద్యుత్ కొరత నేపథ్యంలో అవసరం లేని చోట వినియోగాన్ని తగ్గించి, స్వీయ నియంత్రణ పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ పొదుపు పాటించాలని, సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాలని సూచించారు. తన స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో కుటుంబాల అవసరాలు తీరడమే కాకుండా, మిగులు విద్యుత్‌ను విక్రయించి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం పొందుతున్నారని తెలిపారు. ఈ విధానాన్ని విస్తరించేందుకు మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వం రైతులకు సరఫరా అందించడంలో గణనీయమైన పురోగతి సాధించిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. నీటి కొరత, విద్యుత్ లభ్యతలో సమస్యలు ఉన్నప్పటికీ రైతులకు సరఫరా కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. సమస్యలు ఎదురైనప్పుడే నాయకత్వ సామర్థ్యం బయటపడుతుందని, ఈ పరిస్థితుల్లో బాధ్యతతో పనిచేస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను అభినందిస్తున్నానని చెప్పారు.

**యాదాద్రి ప్లాంట్‌పై కేసీఆర్ సర్కారును నిలదీత**

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణం, బొగ్గు లభ్యత, వ్యయాలపై రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముడిసరుకు లభించే ప్రాంతాలకు సమీపంలోనే పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేయడం సాధారణమని పేర్కొంటూ, సింగరేణి ప్రాంతంలో బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ యాదాద్రి ప్లాంట్‌ను దామరచర్లలో ఏర్పాటు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నాలుగేళ్లలో పూర్తికావాల్సిన ప్లాంట్ పదేళ్లు గడిచినా పూర్తికాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇబ్బందులు అధిగమించి యూనిట్లను ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుందని తెలిపారు. నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్ నిర్మాణంలో అదనంగా రూ.8 వేల కోట్ల వ్యయం జరిగిందని ఆరోపించారు. యూనిట్ విద్యుత్ ఉత్పత్తి వ్యయం కూడా పెరిగిందని విమర్శించారు. సింగరేణి, కోల్ ఇండియా, నైని ప్రాంతాల్లోనూ యాదాద్రి ప్లాంట్‌కు అవసరమైన జీ9 రకం బొగ్గు అందుబాటులో లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ఆ రకం బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా ప్రణాళిక రూపొందించారని విమర్శించారు. విదేశాల నుంచి కృష్ణపట్నం పోర్టు ద్వారా బొగ్గు దిగుమతి చేసుకునే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ప్రస్తుతం జీ12, జీ13 రకాల బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. యాదాద్రి ప్లాంట్‌ను రామగుండం, కొత్తగూడెం, మంచిర్యాల వంటి బొగ్గు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి ఉంటే నిర్మాణ వ్యయం, బొగ్గు రవాణా ఖర్చులు తగ్గేవని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. దామరచర్లకు బొగ్గు తరలించేందుకు ప్రతి ఏడాది సుమారు రూ.2 వేల కోట్ల భారం పడుతోందని ఆరోపించారు. నైని ప్రాంతానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెళ్లి స్థానికులతో చర్చించారని, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడి మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి బొగ్గు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. యాదాద్రి ప్లాంట్ నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని, ప్రతిమా శ్రీనివాసరావుకు ప్రయోజనం కలిగేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై సంబంధిత వర్గాల వివరణను ప్రసంగంలో ప్రస్తావించలేదు.

**ఉపాధి హామీతో గ్రామాల్లో పనులు**

వచ్చే సంక్రాంతి నుంచి మే వరకు నాలుగు నెలల పాటు గ్రామాల్లో ప్రత్యేక ఉపాధి కల్పన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. భూమిలేని పేదలు, కూలీలకు ప్రతిరోజూ పని దొరకాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని చెప్పారు. కేంద్రం నుంచి వచ్చే నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్ద మొత్తంలో ఖర్చు చేయనుందని తెలిపారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రహదారులు వేయడం, చెరువులు, కుంటలు, కాలువలను బాగు చేయడం, గ్రామీణ మౌలిక వసతులను పునరుద్ధరించడం వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి చేతికీ పని, ప్రతి కుటుంబానికీ ఉపాధి కల్పించడమే లక్ష్యమని చెప్పారు. రైతుల్లో ఉత్సాహం నింపేందుకు కళాజాతాలు నిర్వహించాలని సూచించారు. సంక్రాంతి నుంచి మే వరకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఉంటున్నారా లేదా అన్నది పర్యవేక్షిస్తామని, వారి ఫోన్లలో ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ బాధ్యతను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అప్పగిస్తున్నామని, విధులకు దూరంగా ఉండే ప్రజాప్రతినిధులపై చర్యల బాధ్యతను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చూస్తారని చెప్పారు.

# పైసా వసూల్..!

- రంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వసూళ్ల పర్వం
- దళారులు, డాక్యుమెంట్ రైటర్ల కనుసన్నల్లో రిజిస్ట్రేషన్లు
- నిషేధిత భూములు, పార్కు స్థలాలకు రిజిస్ట్రేషన్లు..?!
- ఏసీబీ దాడులు జరుగుతున్నా.. మారని అధికారుల తీరు..!
- ఏటా రూ.3 వేల కోట్ల ఆదాయం వచ్చే జిల్లాలో అక్రమాలపై విచారణ ఏదీ?

**కాకతీయ, తెలంగాణ బ్యూరో/ రంగారెడ్డి బ్యూరో :** రంగారెడ్డి జిల్లాలో సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల లంచావతారుల హవా కొనసాగుతోంది. ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయాల్సిన కార్యాలయాల్లోనే మధ్యవర్తుల ప్రమేయం పెరిగింది. డాక్యుమెంట్ల నమోదుకు అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారు. సామాన్యులు నేరుగా కార్యాలయాలకు వెళ్తే పలు అభ్యంతరాలు చెబుతున్నారు. అదే డాక్యుమెంట్ రైటర్లు, దళారుల ద్వారా వెళ్తే పనులు వేగంగా పూర్తవుతున్నాయి. ప్రతి డాక్యుమెంట్‌కు ఒక రేటు నిర్ణయించి వసూళ్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమయాన్ని ఆదా చేసేందుకు ప్రవేశపెట్టిన స్లాట్ల విధానాన్ని సైతం కొందరు డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తులు దుర్వినియోగం చేస్తున్నారు. ముందుగానే స్లాట్లు బుక్ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, అత్యవసరంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన వారి నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. స్లాట్ బుకింగ్ వివరాలు, రద్దయిన స్లాట్లు, పెండింగ్ దరఖాస్తులు, ఫిర్యాదుల రికార్డులను తనిఖీ చేస్తే ఈ వ్యవహారంలోని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రియల్ వర్గాలు పేర్కొంటుండటం గమనార్హం. చేవెళ్ల, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, ఉప్పల్, కీసర, హయత్‌నగర్, వనస్థలిపురం, చంపాపేట, సరూర్‌నగర్, గండిపేట, అబ్దుల్లాపూర్, శంకర్‌పల్లి సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వసూళ్ల పర్వం యథేచ్ఛగా కొనసాగుతుండటం గమనార్హం.

**నిషేధిత భూములకూ రిజిస్ట్రేషన్లు..!?**

జిల్లాలోని కొన్ని సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిషేధిత జాబితాలో ఉన్న భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తులు, పార్కు స్థలాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గతంలో వనస్థలిపురం కార్యాలయంలో పార్కు స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ వ్యవహారంపై అధికారులు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇటీవల మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత జాబితాలో చేర్చిన భూమిలో కొంతను.. ఏకంగా పది డాక్యుమెంట్లతో ప్రయివేటు వ్యక్తుల పేర్ల మీదకు వెళ్లినట్లుగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన కొన్ని కీలక పత్రాలు సైతం కాకతీయ చేతికి చిక్కాయి. నెలన్నర క్రితం జరిగిన ఈ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పరిశీలిస్తే.. నిషేధిత ఆస్తుల జాబితాలు, సంబంధిత ఉత్తర్వులను సరిపోల్చడం ద్వారా వాస్తవాలను నిర్ధారణకు వచ్చే అవకాశం ఉంది.

**దళారుల దందాకు అడ్డుకట్ట ఎప్పుడు?**

డాక్యుమెంట్ రైటర్లు, రియల్ఎస్టేట్ వ్యాపారులు, మధ్యవర్తుల ప్రమేయంతో కొన్ని కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ వ్యవహారాలు సాగుతున్నాయి. ప్రతి ఫైల్‌కు నిర్దిష్ట మొత్తాన్ని వసూలు చేసి పనులు చేయిస్తున్నారు. అధికారిక రుసుముల వివరాలను కార్యాలయాల్లో స్పష్టంగా ప్రదర్శించకపోవడం గమనార్హం. రంగారెడ్డి జిల్లా నుంచి రిజిస్ట్రేషన్ శాఖకు ఏటా సుమారు రూ.3,000 కోట్ల ఆదాయం వస్తున్నట్లు సమాచారం. ఇంతటి ఆదాయం వచ్చే జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పారదర్శకంగా సాగడం, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పూర్తిగా జమ కావడం అత్యంత కీలకమైన అంశం. ఆస్తుల విలువ నిర్ధారణ, స్టాంపు సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుముల వసూళ్లు, నిషేధిత ఆస్తుల తనిఖీలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలనే డిమాండ్ పెరుగుతోంది.



# 96 ఏళ్ల బామ్మ కల నెరవేర్చేందుకు కేటీఆర్ హామీ!

- సామ్రాజ్యాన్ని ఆప్యాయంగా పలకరించి సత్కరించిన కేటీఆర్
- త్వరలో కేసీఆర్‌తో భేటీకి ఏర్పాట్లు చేస్తానని వెల్లడి

**కాకతీయ, హైదరాబాద్ :** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరానికి చెందిన 96 ఏళ్ల దుగ్గిదేవర సామ్రాజ్యం చిరకాల కోరిక నెరవేర్చేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును కలిసి ఫొటో దిగాలన్న ఆమె ఆకాంక్షను త్వరలో నెరవేరుస్తానని తెలిపారు. మల్లవరం సర్పంచ్‌గా రెండుసార్లు, ఎంపీటీసీగా రెండుసార్లు, సింగిల్ విండో డైరెక్టర్‌గా పనిచేసిన సామ్రాజ్యం గ్రామంలో అన్ని వర్గాల ప్రజల గౌరవాభిమానాలు పొందారు. కేసీఆర్‌పై ఆమెకున్న అభిమానాన్ని పెద్ద కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు వెంకటలాల్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రవిచంద్ర శుక్రవారం సామ్రాజ్యాన్ని ఆమె కుమారులు వెంకటలాల్, అజయ్‌కుమార్, మనవళ్లు యుధిష్టర్, శ్రీరఘునందన్‌లతో కలిసి తెలంగాణ భవన్‌కు తీసుకెళ్లారు. కేటీఆర్ ఆమెను ఆప్యాయంగా పలకరించి శాలువాతో సత్కరించారు.



**చిన్న వయసులోనే సమాజసేవ..**

సామ్రాజ్యం మనవడు శ్రీరఘునందన్ చిన్నతనంలోనే సమాజసేవకు శ్రీకారం చుట్టారు. 2016 ఫిబ్రవరి 17న, తొమ్మిదేళ్ల వయసులో ఐదో తరగతి చదువుతున్న సమయంలో కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మల్లవరంలోని ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకున్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పచ్చదనం, పరిశుభ్రతకు కృషి చేశారు. ఈ సేవలకు గుర్తింపుగా 2017లో జాతీయ స్థాయిలో, 2017-18లో రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ పాఠశాల పురస్కారాలు లభించాయి. ప్రస్తుతం బెంగళూరులో బీబీఏ చదువుతున్న శ్రీరఘునందన్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్, రవిచంద్ర అభినందించారు.

# గాడి తప్పిన టౌన్ ప్లానింగ్

- అక్రమ నిర్మాణాలకు అడ్డాగా కరీంనగర్!
- అనుమతులకు మించి భవన నిర్మాణాలు
- సెల్లార్లు, పార్కింగ్ స్థలాల వినియోగంలో ఉల్లంఘనలు
- భవన నిర్మాణ నిబంధనలకు తూట్లు
- నగరంలో పెరుగుతున్న అక్రమ నిర్మాణాలు
- నోటీసుల జారీతోనే అధికారులు సరిపెడుతున్నారా?

**కాకతీయ, కరీంనగర్ :** కరీంనగర్ నగరంలో భవన నిర్మాణాల తీరుపై చర్చ జరుగుతోంది. నిర్మాణ అనుమతులు, ఆమోదించిన ప్రణాళికలు, క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనుల మధ్య వ్యత్యాసాలుంటున్నాయి. అనుమతించిన అంతస్తులకు మించి నిర్మాణాలు చేపట్టడం, సెల్లార్లను ఇతర అవసరాలకు వినియోగించడం, పార్కింగ్ స్థలాల్లో మార్పులు చేయడం వంటి ఉల్లంఘనలు జరుగుతున్నాయి. నగరంలో బహుళ అంతస్తుల భవనాలు పెరుగుతున్న నేపథ్యంలో నిర్మాణ అనుమతుల అమలు, అధికారుల తనిఖీలు, ఉల్లంఘనలపై చర్యలు కీలకంగా మారాయి. కరీంనగర్ నగరంలో భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకునే సమయంలో సమర్పించిన ప్రణాళికలకు అనుగుణంగానే నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ విషయం అధికారుల తనిఖీల్లో బయటపడుతున్నా.. నామమాత్రపు జరిమానాలు, నోటీసులతో మమ అనిపించేస్తున్నారు. ఆమోదించిన అంతస్తుల సంఖ్యకు మించి నిర్మాణాలు చేపట్టడం, భవన విస్తీర్ణాన్ని పెంచడం, అదనపు గదులు నిర్మించడం వంటి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వస్తున్నాయి. భవన నిర్మాణ అనుమతులు, ఆమోదిత ప్రణాళికలు, క్షేత్రస్థాయి కొలతలను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి వెల్లడవుతుంది.



**సెల్లార్లు పార్కింగ్‌కేనా?**

నగరంలోని భవనాల్లో పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్లను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. పార్కింగ్ స్థలాల్లో అదనపు నిర్మాణాలు చేపట్టడం, వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. అనుమతుల్లో సెల్లార్ల వినియోగం ఎలా పేర్కొన్నారు? క్షేత్రస్థాయిలో అవి అదే ప్రయోజనానికి ఉపయోగిస్తున్నారా? అనే అంశాలపై తనిఖీలు నిర్వహించాల్సి ఉండగా..తనిఖీలకు టౌన్ ప్లానింగ్ అధికారులు దాదాపుగా దూరంగా ఉంటూ వస్తున్నారు. కరీంనగర్‌లో బహుళ అంతస్తుల భవన నిర్మాణాల విషయంలో అంతస్తుల సంఖ్య, నిర్మాణ ఎత్తు, విస్తీర్ణం, పార్కింగ్ సదుపాయాలు వంటి అంశాలు కీలకం. అనుమతించిన ప్రణాళికకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై టౌన్ ప్లానింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారా? నిర్మాణ దశలోనే ఉల్లంఘనలను గుర్తించారా? నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినవారికి ఎన్ని నోటీసులు జారీ చేశారు? అనే వివరాలు కూడా వెల్లడించడానికి అధికారులు ఇష్టపడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**నోటీసులిచ్చి వదిలేస్తున్న వైనం..**

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందినప్పుడు అధికారులు నోటీసులు జారీ చేయడంతో పాటు, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్ నగరంలో భవన నిర్మాణ ఉల్లంఘనలపై గతంలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఎన్ని తనిఖీలు నిర్వహించారు? ఎన్ని నోటీసులు జారీ చేశారు? వాటిలో ఎన్ని నిర్మాణాలపై చర్యలు తీసుకున్నారు? ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? అనే వివరాలు ప్రజలకు తెలియాల్సి ఉంది. నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా ఉల్లంఘనలు కొనసాగుతున్నాయా అనే అంశాన్ని తనిఖీ నివేదికల ఆధారంగా పరిశీలించాల్సి ఉంది. భవన నిర్మాణ అనుమతులు, ఆమోదిత ప్రణాళికల అమలు, క్షేత్రస్థాయి తనిఖీలు, నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంలో టౌన్ ప్లానింగ్ విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. నగరంలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై అధికారులు చేపట్టిన తనిఖీలు, విచారణలు, చర్యల వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# భద్రతే అభివృద్ధికి పునాది!

(మొదటిపేజీ తరువాయి)

భట్టి విక్రమార్క అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా భద్రతా వ్యవస్థలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయాలని సూచించారు. శారీరక దృఢత్వంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపైనా సిబ్బంది పట్టు సాధించాలని తెలిపారు. అమీన్‌పూర్‌లో ప్రత్యేక శిక్షణ అకాడమీ ఉండటం సంతోషకరమని పేర్కొంటూ, సిబ్బందికి నిరంతర శిక్షణ అవసరమన్నారు. ఆయుధాల కంటే క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యత ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రజల్లో భయం కలిగించడం కాకుండా భరోసా కల్పించడమే మంచి భద్రతా వ్యవస్థ లక్ష్యమని చెప్పారు.

**సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం**

భద్రతా సిబ్బంది విధి నిర్వహణ వెనుక వారి కుటుంబ సభ్యుల త్యాగం కూడా ఉంటుందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. సిబ్బంది సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. 1991 అక్టోబర్ 23న ఏర్పాటైన తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం 35 ఏళ్లుగా కీలక సంస్థలకు రక్షణ కల్పిస్తోందని పేర్కొంటూ, అధికారులకు, సిబ్బందికి 36వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఛాయా సోమేశ్వరాలయానికి మహర్దశ!

- ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు
- యునెస్కో గుర్తింపు దిశగా కృషి చేస్తా : మంత్రి కోమటిరెడ్డి
- సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, జూపల్లికి కృతజ్ఞతలు

**కాకతీయ, హైదరాబాద్ :** నల్లగొండ జిల్లా పానగల్‌లోని చారిత్రక ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ నిర్ణయంపై రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి, ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. వందల ఏళ్ల క్రితమే కాంతి, నీడ, నిర్మాణ శాస్త్రాలను సమన్వయం చేసి శివలింగంపై నిరంతర ఛాయ కనిపించేలా ఛాయా సోమేశ్వరాలయాన్ని నిర్మించడం ప్రాచీన భారతీయ నిర్మాణ విజ్ఞానానికి అద్భుత నిదర్శనమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే ఈ ఆలయానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

**ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం**

ఆలయ అభివృద్ధికి మంజూరైన నిధులతో పర్యాటక ప్రాధాన్యాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు, పర్యాటకులను ఆకర్షించేలా ప్రముఖ కట్టడాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నిధులు మంజూరు కావడంతో ఆలయ అభివృద్ధిపై భక్తులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# క్వారీల్లో కాసుల వేట!

- భూపాలపల్లిలో ఇసుక తవ్వకాల మాటున అక్రమాలు
- లోడింగ్ వద్ద అదనపు వసూళ్ల దందా
- అనుమతులున్నా.. పర్యవేక్షణలో డొల్లతనం
- ఇసుక రవాణాలో నిబంధనలకు తూట్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్న వైనం
- రీచ్‌ల నిర్వహణపై కొరవడిన నియంత్రణ

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇసుక క్వారీల నిర్వహణపై అక్రమాల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తవ్వకాల నుంచి లారీల లోడింగ్, రవాణా వరకు సాగుతున్న వ్యవహారాలపై ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఇసుక రీచ్‌ల నిర్వహణలో నిబంధనలు అమలు కావాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో అదనపు వసూళ్లు, తవ్వకాల పరిమాణం, రవాణా లెక్కలపై వివాదాలు తలెత్తుతున్నాయి. లారీల లోడింగ్ సమయంలో నిర్ణీత మొత్తానికి మించి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కొనుగోలుదారులపై భారాన్ని పెంచుతున్నాయి. మరోవైపు, తవ్విన ఇసుక పరిమాణం, విక్రయాల లెక్కలు, ప్రభుత్వానికి జమవుతున్న ఆదాయంపై పూర్తి వివరాలు అందుబాటులో లేకపోవడంతో క్వారీల నిర్వహణ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇచ్చినప్పుడు తవ్వకాల విస్తీర్ణం, పరిమాణం, కాలపరిమితిపై నిబంధనలు వర్తిస్తాయి. అనుమతించిన పరిధిలోనే తవ్వకాలు జరపాల్సి ఉంటుంది. తవ్విన ఇసుక పరిమాణాన్ని నమోదు చేయడం, నిల్వలు, విక్రయాల లెక్కలను నిర్వహించడం కూడా తప్పనిసరి. అయితే జిల్లాలోని క్వారీల నిర్వహణలో ఈ నిబంధనలు ఏ మేరకు అమలవుతున్నాయన్నది తనిఖీ నివేదికల ద్వారా స్పష్టం కావాల్సి ఉంది. అనుమతులకు మించి తవ్వకాలు జరిగితే సహజ వనరులపై ప్రభావం పడటంతోపాటు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయమూ తగ్గే అవకాశం ఉంటుంది.

**లారీల లోడింగ్ వద్ద వసూళ్ల పర్వం**

ఇసుక క్వారీల వద్ద లారీల లోడింగ్ వ్యవహారం కూడా వివాదాస్పదంగా మారుతోంది. నిర్ణీత ధరకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. అధికారిక చెల్లింపులకు సంబంధించిన రసీదులు, వాహనాల లోడింగ్ వివరాలు, రవాణా పత్రాలను పరిశీలిస్తే వసూళ్ల వ్యవహారంపై స్పష్టత వస్తుంది. అదనపు చెల్లింపులు చేయాల్సి వస్తే ఇసుక కొనుగోలుదారులపై భారం పడుతోంది. ఈ వ్యవహారంపై వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలు వెలుగులోకి రావాల్సి ఉంది. ఇసుక విక్రయాల ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పూర్తిస్థాయిలో జమ కావాలి. క్వారీల్లో తవ్విన ఇసుక, విక్రయించిన పరిమాణం, వసూలైన మొత్తం, ప్రభుత్వ ఖాతాల్లో జమ అయిన ఆదాయం మధ్య పొంతన ఉండాలి. ఈ లెక్కల్లో వ్యత్యాసాలు ఉంటే వాటికి కారణాలను గుర్తించాల్సి ఉంటుంది. క్వారీల వారీగా ఆదాయ వివరాలు, బకాయిలు, జరిమానాల వసూళ్లు, తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనల వివరాలు వెల్లడైతే ప్రభుత్వ ఆదాయ పరిస్థితిపై స్పష్టత వస్తుంది.

**రవాణా వ్యవహారాల్లోనూ ఉల్లంఘనలు**

క్వారీల నుంచి ఇసుకను తరలించే వాహనాలకు సంబంధించిన రవాణా పత్రాలు, లోడింగ్ పరిమాణాలు, అనుమతుల వివరాలు కీలకంగా ఉంటాయి. పత్రాల్లో నమోదైన పరిమాణానికి భిన్నంగా ఇసుక తరలిస్తే నిబంధనల ఉల్లంఘన జరిగినట్లే. జిల్లాలో అక్రమ రవాణాపై నిర్వహించిన తనిఖీలు, పట్టుబడిన వాహనాలు, నమోదైన కేసులు, విధించిన జరిమానాల వివరాలు వెల్లడికావాల్సి ఉంది. రవాణా నిబంధనల అమలులో లోపాలు ఉంటే ఇసుక అక్రమ తరలింపునకు అవకాశం ఏర్పడుతుంది. ఇసుక తవ్వకాలు, లోడింగ్, విక్రయాలు, రవాణాను పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత శాఖలదే. క్వారీల నిర్వహణపై తనిఖీలు, ఫిర్యాదుల విచారణ, ఉల్లంఘనలపై చర్యలు నిరంతరం కొనసాగాలి. అయితే జిల్లాలోని రీచ్‌లపై నిర్వహించిన తనిఖీలు, గుర్తించిన లోపాలు, తీసుకున్న చర్యల వివరాలు సమగ్రంగా వెలుగులోకి రావాల్సి ఉంది. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయిన చోట బాధ్యులపై చర్యలు తీసుకున్నప్పుడే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. భూపాలపల్లి జిల్లాలోని ఇసుక క్వారీల అనుమతులు, తవ్వకాల లెక్కలు, విక్రయాలు, రవాణా, ఆదాయ వివరాల పరిశీలనతోనే వ్యవహారంలో వాస్తవాలు పూర్తిగా బయటపడనున్నాయి.



## భువనేశ్వర్ జాతీయ సదస్సుకు బల్దియా కమిషనర్

- పట్టణాభివృద్ధి, వ్యర్థాల నిర్వహణపై చర్చ
- రాష్ట్రం నుంచి నామినేట్



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరగనున్న 2వ జాతీయ పట్టణ సదస్సు2026 కు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి వెంకన్న హాజరుకానున్నారు. అక్టోబర్ 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు హాజరుకావాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ టి కె శ్రీదేవి కమిషనర్ వెంకన్నను నామినేట్ చేశారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా పట్టణాభివృద్ధి, నీటి నిర్వహణ, ఘన వ్యర్థాల నియంత్రణ, మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన పౌర సేవలు అందించడం వంటి కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. తెలంగాణలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ఈ సదస్సులో జరిగే చర్చలు, తీసుకునే నిర్ణయాలు వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి, స్మార్ట్ సిటీ పనుల వేగవంతానికి ఎంతో ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు.

## రోడ్డు ప్రమాద మృతుడు సందీప్‌కు నివాళులు

- మృతుడి కుటుంబానికి నాయకుల పరామర్శ
- అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోసిన నేతలు
- మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి నివాళి

**కాకతీయ, కేసముద్రం:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అర్పణపల్లి గ్రామానికి చెందిన సందీప్‌కు మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి నివాళులర్పించారు. బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో సందీప్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్య భవాని తీవ్ర గాయాలతో ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. శుక్రవారం సందీప్ నివాసానికి చేరుకున్న గంట సంజీవరెడ్డి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో మాజీ మార్కెట్ చైర్మన్ నీలం దుర్గేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మి గౌడ్ పాల్గొని పాడె మోశారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బండారు వెంకన్న, సర్పంచ్ కుమారస్వామి, చిన్న వెంకన్న, వల్లందాసు రవి, తరాల వీరేష్, కమకుటం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి రవీందర్, తండ సంపత్, బిర్రు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆడిటింగ్‌లో గోల్‌మాల్!

**హన్మకొండ ట్రెజరీ లెక్కల్లో తేడాలెన్నో!**

- ఆదాయపు పన్ను నుంచి ఉద్యోగుల ఎస్కేప్
- కొంతమంది ఉద్యోగులకు సహకరిస్తున్న సిబ్బంది..?
- ఆడిట్ అభ్యంతరాల పరిష్కారంలో జాప్యం
- లెక్కల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏదీ?



కాకతీయ, వరంగల్ బ్యూరో : హన్మకొండ ట్రెజరీ లెక్కల్లో ఏం జరుగుతోంది? ఆడిటింగ్‌లో నమోదవుతున్న వివరాలకు, వాస్తవ లావాదేవీలకు మధ్య తేడాలున్నాయా? ఆదాయపు పన్ను చెల్లింపుల నుంచి తప్పించుకునేందుకు కొందరికి సహకారం అందుతోందా? ప్రభుత్వ ఆర్థిక లావాదేవీల నిర్వహణలో కీలకమైన ట్రెజరీ శాఖ పనితీరుపై ఈ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆదాయ వివరాల నమోదు, పన్ను మినహాయింపులు, ధ్రువపత్రాల పరిశీలనలో నిబంధనలు పాటిస్తున్నారా..? అంటే లేదనే సమాధానమే వస్తోంది. లెక్కల నిర్వహణలో లోపాలు చోటుచేసుకుంటే వాటిని ఆడిట్ సమయంలో గుర్తించి సరిదిద్దాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆడిట్ నివేదికలు, ట్రెజరీ రికార్డులు, పన్ను మినహాయింపులకు సంబంధించిన పత్రాల పరిశీలన అంశం కొంతమంది అధికారులకు, కార్యాలయ సిబ్బందికి ఆదాయ వనరుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**లెక్కల్లో తేడాలెందుకు?**

ట్రెజరీ ద్వారా నిర్వహించే ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ప్రతి చెల్లింపు, మినహాయింపు, ఆమోదానికి ఆధార పత్రాలు ఉండాలి. ఉద్యోగుల వేతనాలు, ఇతర చెల్లింపులు, పన్ను మినహాయింపుల వివరాలు రికార్డుల్లో సక్రమంగా నమోదవ్వాలి. అయితే నమోదైన లెక్కలకు, వాస్తవ లావాదేవీలకు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయన్న ఆరోపణలు వస్తే వాటిని అధికారిక పత్రాలతో పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఆదాయపు పన్ను మినహాయింపులకు సంబంధించి సమర్పించే వివరాలు, ధ్రువపత్రాలను పరిశీలించిన తర్వాతే వాటిని ఆమోదించాల్సి ఉండగా.. తప్పుడు వివరాల నమోదుతో క్లెయిమ్‌లకు అనుమతులు ఇచ్చేస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది ఉద్యోగులు పన్ను చెల్లింపుల నుంచి తప్పించుకుంటున్నట్లు సమాచారం. పన్ను మినహాయింపుల దరఖాస్తులు, వాటికి జత చేసిన పత్రాలు, ఆమోదించిన అధికారుల వివరాలను పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతాయని ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు.

**ఆడిట్ అభ్యంతరాలపై చర్యలేవి?**

ట్రెజరీ లావాదేవీలపై నిర్వహించిన ఆడిటింగ్‌లో నమోదైన అభ్యంతరాలు, వాటిపై అధికారులు ఇచ్చిన వివరణలు, సరిదిద్దిన లెక్కల వివరాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తే..అక్రమాల జాబితా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఎన్ని అభ్యంతరాలు నమోదయ్యాయి? వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయి? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? లెక్కల్లో లోపాలు గుర్తించిన సందర్భాల్లో బాధ్యులపై చర్యలు తీసుకున్నారా? అనే వివరాలు పరిశీలించాలని ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆడిట్ నివేదికలు, అభ్యంతరాల పరిష్కార పత్రాలు, శాఖాపరమైన ఉత్తర్వుల ద్వారా ఈ అంశాలపై స్పష్టత వస్తుందని పేర్కొంటున్నారు. ట్రెజరీలో లెక్కల నమోదు, ధ్రువపత్రాల పరిశీలన, చెల్లింపుల ఆమోదం, పన్ను మినహాయింపుల ప్రక్రియలో సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించాలి. ఆర్థిక లావాదేవీల్లో లోపాలు గుర్తించినప్పుడు వాటిని సరిదిద్దడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఆడిట్ అభ్యంతరాలపై తీసుకున్న చర్యలు, పెండింగ్ విచారణలు, ప్రభుత్వానికి నష్టం జరిగినట్లు నిర్ధారణ అయితే దాని వివరాలను సంబంధిత శాఖ వెల్లడించాల్సి ఉంది. ట్రెజరీ రికార్డులు, ఆడిట్ నివేదికలు, పన్ను మినహాయింపుల పత్రాల పరిశీలనతోనే ఈ వ్యవహారంలోని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి.

# బార్లను తలదన్నే బెల్ట్ షాపులు

- ఏటూరునాగారంలో ఎక్సైజ్ నిఘా డొల్ల
- అర్ధరాత్రి 2 గంటలైనా బెల్ట్ షాపులలో మద్యం విక్రయాలు
- బాటిల్‌పై రూ.60 బాదుడు.. కొన్ని చోట్ల గుడుంబా విక్రయాలు
- మండల కేంద్రంలోనే 200 పైగా బెల్ట్ షాపులు
- కంప్లైంట్ ఇస్తేనే చర్యలు అంటున్న ఏక్సైంజ్ శాఖ అధికారులు



గ్రామాలకు తరలిస్తున్న మద్యం ఆటో



మండల కేంద్రంలో బారుగా మారిన బెల్ట్ షాపులు

**కాకతీయ, ఏటూరునాగారం రూరల్ :** బెల్ట్ షాపులంటే చిన్న గది.. నాలుగైదు మద్యం సీసాలు.. రహస్యంగా సాగించే విక్రయాలు.. కానీ ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో మాత్రం బెల్ట్ షాపుల నిర్వచనమే మారిపోయింది. బార్లను తలదన్నే విశాలమైన ప్రదేశాలు.. కూర్చుని మద్యం సేవించే ఏర్పాట్లు.. పక్కనే స్నాక్స్, ఆహార పదార్థాల విక్రయాలు.. వెరసి బెల్ట్ షాపుల ముసుగులో బహిరంగ మద్యం కేంద్రాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోనే 216కు పైగా బెల్ట్ షాపులు నడుస్తుండటం అక్రమ మద్యం విక్రయాల విస్తృతిని చాటుతోంది. ఇంత భారీ సంఖ్యలో విక్రయ కేంద్రాలు కొనసాగుతున్నా ఎక్సైజ్ శాఖ నియంత్రణ చర్యలు కనిపించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను అమలు చేయాల్సిన యంత్రాంగం పర్యవేక్షణలోని లోపాలు బెల్ట్ షాపుల నిర్వాహకులకు కలిసొస్తున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**వైన్ షాపులకు తాళం..**
**బెల్ట్ షాపులకు అర్ధరాత్రి వరకు జాతర**

వైన్ షాపులు రాత్రి 8.30 గంటలకే మూతపడుతుంటే ఏటూరునాగారం బెల్ట్ షాపుల్లో మాత్రం రాత్రి 11 గంటల వరకు మద్యం విక్రయాలు సాగుతున్నాయి. మండల కేంద్రంలోని మూడు బెల్ట్ షాపుల్లో అర్ధరాత్రి 2 గంటలైనా అమ్మకాలు ఆగడం లేదు. అదీ ప్రధాన రహదారి పక్కనే.. కొన్ని దుకాణాలకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనూ విక్రయ కేంద్రాలు కొనసాగుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సాధారణ దుకాణాల పని వేళలు ముగిసినా బెల్ట్ షాపుల్లో మద్యం అందుబాటులో ఉండటం, రాత్రివేళల్లో ఆకస్మిక తనిఖీలు కొరవడటం ఎక్సైజ్ నిఘా తీరుపై తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

**బాటిల్‌పై రూ.60 బాదుడు..**
**అదనపు వసూళ్ల దందా**

బెల్ట్ షాపుల నిర్వహకుల మద్యం బాటిల్‌పై రూ.60 వరకు అదనంగా వసూలు చేస్తూ వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. నిర్ణీత ధరలకు మించి అమ్మకాలు సాగుతున్నా వాటిని అరికట్టే చర్యలు కనిపించడం లేదనే విమర్శలున్నాయి. అధిక ధరల వసూళ్లు, వేళలు దాటిన విక్రయాలు, బార్లను తలపించే ఏర్పాట్లు.. ఇలా బెల్ట్ షాపుల నిర్వహణ సాగుతున్నా ధరల తనిఖీలపై ఎక్సైజ్ శాఖ దృష్టి ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంది. నిర్ణీత ధరలను ఉల్లంఘించే కేంద్రాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా పెంచకపోవడం నిర్వాహకుల ఇష్టారాజ్యానికి అవకాశం కల్పిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**బెల్ట్ ముసుగులో గుడుంబా..**
**అధికారుల కళ్లెదుటే దందా**

మద్యం విక్రయాలతోపాటు కొన్ని కేంద్రాల్లో గుడుంబా వ్యాపారం సైతం బహిరంగంగా సాగుతోంది. బీరు, మద్యం సీసాల్లో గుడుంబా నింపి విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ శాఖకు కూతవేటు దూరంలోనే ప్రధాన రహదారి పక్కన 20కి పైగా మద్యం విక్రయ కేంద్రాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. అక్రమ విక్రయాలను అడ్డుకోవాల్సిన శాఖ సమీపంలోనే బెల్ట్ షాపుల దందా సాగుతుండటం నిఘా వ్యవస్థ పనితీరుపై అనేక విమర్శలకు తావిస్తోంది. గుడుంబా నిల్వలు, సరఫరా మార్గాలు, విక్రయదారులపై ప్రత్యేక విచారణ చేపట్టి అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**మామూళ్ల ఆరోపణలు.. అధికారుల మౌనం**

బెల్ట్ షాపులపై ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా, బహిరంగంగా కొనసాగుతున్న విక్రయాలపై స్వయంగా తనిఖీలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. మరోవైపు నిర్వాహకుల నుంచి సంబంధిత అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు ఈ వ్యవహారాన్ని మరింత వివాదాస్పదం చేస్తున్నాయి. అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు, అధిక ధరల వసూళ్లు, గుడుంబా దందా కొనసాగుతున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ తీరుపై మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఆరోపణలు నిజమని తేలితే నిర్వాహకులతోపాటు బాధ్యులైన అధికారులపైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బెల్ట్ షాపుల దందాకు అడ్డుకట్ట వేసి, మామూళ్ల ఆరోపణల వెనుక వాస్తవాలను వెలికితీసినప్పుడే ఎక్సైజ్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని పేర్కొంటున్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి జన్మదిన వేడుకలు

- రాంపూర్ సర్పంచ్ రడం భరత్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు




**కాకతీయ, గీసుగొండ:** మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిధర్‌రావు జన్మదిన వేడుకలను గీసుగొండ మండలం ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద ఘనంగా నిర్వహించారు. రాంపూర్ సర్పంచ్ రడం భరత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం బిర్యానీ పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు కొండా మురళికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మనుగొండ సర్పంచ్ పేర్ల శ్రవణ్, వంచనగిరి సర్పంచ్ కొమ్ముల కమల బిక్షపతి, సూర్య తండా సర్పంచ్ రాఘవేంద్ర, నాయకులు బోనాల అశోక్, రౌతు యుగేందర్, కొమ్ముల ఏసేబు, యువ నాయకులు మంద అనిల్, అఖిల్‌రెడ్డి, కొమ్ముల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులుగా మామిడి జనార్ధన్, భానోత్ వీరన్న నాయక్



భానోత్ వీరన్న నాయక్



మామిడి జనార్ధన్

**కాకతీయ, ఇనుగుర్తి:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు భూక్యా ఉమా మురళి నాయక్ ఆదేశాల మేరకు ఇనుగుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బైరు అశోక్ గౌడ్ శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా మామిడి జనార్ధన్, భానోత్ వీరన్న నాయక్‌లను నియమించి, మండల కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షులు తమకు అవకాశం కల్పించిన జిల్లా, మండల నాయకత్వానికి, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- అర్హులు ఓటు హక్కును వినియోగించుకోవాలి
- బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నేతల పరామర్శ
- మండల అధ్యక్షుడు రంగు మురళి గౌడ్ పిలుపు



**కాకతీయ, పెద్దవంగర:** వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రంగు మురళి గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన చిలుక ఎల్లమ్మ, ఆమె కుమార్తె రేణుక అనారోగ్యంతో మృతి చెందడంతో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దసాని సురేష్, శ్రీనివాస్, హరికృష్ణ, నరేష్, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూ రీసర్వేను వేగవంతం చేయాలి!

- భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- రైతులు అధికారులకు సహకరించాలి
- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**కాకతీయ, భీమదేవరపల్లి:** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో రోవర్ సాంకేతికతతో కొనసాగుతున్న రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు సర్వే చేశారు, ఇంకా ఎంత భూమి సర్వే చేయాల్సి ఉందనే వివరాలను భూముల కొలతల శాఖ ఏడీ నూర్‌సింగ్, సర్వేయర్ విజయభాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో పక్క భూముల రైతులు అందుబాటులో ఉంటూ హద్దులను చూపించి సహకరిస్తున్నారా అని ఆరా తీశారు. రీసర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతులు అధికారులకు సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామంలో సాగవుతున్న వరి పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలు, వాటి దశలపై వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్న సమయం, సబ్ స్టేషన్ పనులు, మరమ్మతుల గురించి విద్యుత్ శాఖ ఏఈఈ లక్ష్మణ్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. రబీ సీజన్‌లో జొన్న పంట సాగు చేయనున్నట్లు రైతులు, ఏఈఓ నాగరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమల, నాయబ్ తహసీల్దార్ సూర్య, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఫేక్ పెట్టుబడుల సమ్మిట్‌ను అడ్డుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ సహా మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో తమ పార్టీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. మియాపూర్‌లో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన రాజధాని రణభేరి సభలో ఆమె మాట్లాడారు. రాష్ట్రానికి రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని కవిత అన్నారు. గతంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సుల ద్వారా వాస్తవంగా ఎన్ని పెట్టుబడులు వచ్చాయి? ఎన్ని పరిశ్రమలు ప్రారంభమయ్యాయి? అనే వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల కోసం రైతుల నుంచి సేకరించిన భూములను ముఖ్యమంత్రి తన సోదరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంతోనే పార్టీని ఏర్పాటు చేశామని, సమస్యలపై ప్రశ్నించడమే కాకుండా పరిష్కారాల కోసం పోరాడతామని చెప్పారు.

**నగరంలో కనీస సౌకర్యాలు కరువు**

హైదరాబాద్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పాతబస్తీలో మురికినీరు సరఫరా అవుతోందని, పలుచోట్ల డ్రైనేజీ నీరు తాగునీటిలో కలుస్తోందని కవిత ఆరోపించారు. రూ.11 వేల కోట్ల బడ్జెట్ ఉన్న జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని, వీధి దీపాలు సరిగా వెలగడం లేదని విమర్శించారు. దోమలు, వీధికుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జవహర్‌నగర్ డంప్‌యార్డు కాలుష్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేశారు. చెత్త సేకరణ బండ్ల ద్వారా జీవనం సాగిస్తున్న సుమారు 50 వేల మంది ఉపాధికి ముప్పు కలిగించే చర్యలను సహించబోమని కవిత హెచ్చరించారు. రామ్‌కీ సంస్థకు కాంట్రాక్టు ఇవ్వడం కోసం కార్మికులకు అన్యాయం చేస్తే ముఖ్యమంత్రి ఇంటి ముందు చెత్త వేస్తామని వ్యాఖ్యానించారు. కూరగాయలు, చేపలు విక్రయించే చిరువ్యాపారులకు కూడా ఏసీ వాహనాలు అందించాలని సూచించారు.

**ఐటీ ఉద్యోగులు, యువతకు భరోసా**

కృత్రిమ మేధస్సు కారణంగా ఐటీ ఉద్యోగాలపై ప్రభావం పడే పరిస్థితి ఉందని, ఉద్యోగుల కోసం ప్రత్యేక విధానం అవసరమని కవిత అన్నారు. యువతను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తమ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉచిత విద్య, వైద్యం, మెరుగైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రతి డివిజన్‌కు 24 గంటలు పనిచేసే ఆసుపత్రి ఉండాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కవిత డిమాండ్ చేశారు. మహిళలు, యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ముస్లింలను ఓట్ల కోసం ఉపయోగించుకొని రాజకీయ పార్టీలు మోసం చేశాయని విమర్శిస్తూ, తెలంగాణ రక్షణ సేనలోకి రావాలని ఆహ్వానించారు. జీహెచ్ఎంసీలోని 300 స్థానాల్లో పోటీ చేస్తామని, మూడు కార్పొరేషన్ల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. పార్టీ తరఫున తొలిసారిగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీకాంత్ గౌడ్‌కు మద్దతుగా నిలవాలని, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం కృషి చేయాలని కోరారు.

# తిరకాసులు

- రికార్డుల్లో ఒకటి.. క్షేత్రస్థాయిలో మరొకటి!
- ఫిర్యాదులు చేసినా పరిష్కారం కాని సమస్యలు
- సర్వేలు, పట్టాదారు పత్రాల చుట్టూ వివాదాలు
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు
- ప్రభుత్వ భూముల పరిరక్షణపై తలెత్తుతున్న ప్రశ్నలు
- భూ రికార్డుల పరిశీలనతోనే అక్రమాల గుట్టురట్టు!




**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** భూమి కొనుగోలు చేయాలన్నా.. వారసత్వంగా వచ్చిన ఆస్తిని పంచుకోవాలన్నా.. పట్టాదారు వివరాల్లో మార్పులు చేయించుకోవాలన్నా రెవెన్యూ రికార్డులే కీలకం. కానీ రికార్డుల్లోని తప్పులు, సర్వే నంబర్లలో వ్యత్యాసాలు, భూమి హద్దుల వివాదాలు సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నాయి. ఈ సమస్యల మధ్య భూముల ఆక్రమణలకు అవకాశం ఏర్పడుతోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటున్నాయి. క్షేత్రస్థాయి సర్వేలో గుర్తించిన వాస్తవాలు రికార్డుల్లోకి ఎక్కడం లేదు. ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలేమిటి..? అన్న నివేదికలు కూడ ఉన్నతాధికారులకు చేరడంలో జాప్యం జరుగుతుండటం గమనార్హం. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత లోపిస్తోంది. ఫలితంగా అసలు హక్కుదారులు ఇబ్బందులు పడటంతో పాటు వివాదాలు మరింత పెరుగుతూపోతున్నాయి.

**గుట్టలుగా ఫిర్యాదులు..!**

భూముల హద్దులు, యాజమాన్య హక్కులు, పట్టాదారు వివరాలు, వారసత్వ మార్పులకు సంబంధించి ప్రజలు రెవెన్యూ కార్యాలయాలకు ఫిర్యాదులు సమర్పిస్తున్నారు. అయితే ఫిర్యాదుల స్వీకరణ నుంచి పరిష్కారం వరకు ఏ దశలోనూ సంబంధించిన వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించినవి, తిరస్కరించినవి, పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని? వాటిలో జాప్యానికి కారణాలేమిటి? క్షేత్రస్థాయి విచారణలు ఎన్ని నిర్వహించారు? అనే వివరాలు అధికారిక రికార్డుల ద్వారా పరిశీలించాలి. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరిగితే బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భూములపై వివాదాలు పెరిగే పరిస్థితులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. దరఖాస్తుల స్థితిని పారదర్శకంగా వెల్లడించి, నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కానీ వాస్తవంలో ఇవేమీ జరగడం లేదు.

**సర్వేలే కీలకం..**

భూ ఆక్రమణలు, హద్దుల వివాదాలను పరిశీలించేటప్పుడు సర్వే నంబరు, ఉపవిభాగం, భూమి విస్తీర్ణం, పట్టాదారు వివరాలు, పాత రికార్డులు కీలక ఆధారాలుగా ఉంటాయి. ఒకే సర్వే నంబరులోని భూమికి సంబంధించి వేర్వేరు పత్రాల్లో విభిన్న వివరాలు నమోదైతే వాటిని సమగ్రంగా పరిశీలించాలి. గ్రామ పటం, సేత్వార్, పహాణీ, పట్టాదారు పాస్‌పుస్తకాలు, మ్యుటేషన్ రికార్డులు, సర్వే నివేదికలను సరిపోల్చాలి. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, పార్కు స్థలాలకు సంబంధించిన రికార్డులను కూడా ప్రత్యేకంగా పరిశీలించాలి. రికార్డుల్లో మార్పులు ఎప్పుడు జరిగాయి? ఏ ఉత్తర్వుల ఆధారంగా జరిగాయి? అనే అంశాలను గుర్తించాల్సి ఉంటుంది. భూ వివాదాల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, సంబంధిత రికార్డుల నిర్వహణ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారు. భూముల హద్దుల నిర్ధారణ, యాజమాన్య వివరాల పరిశీలన, రికార్డుల సవరణ, ఆక్రమణలపై చర్యలు వంటి అంశాల్లో ప్రతి అధికారి బాధ్యత ఏమిటో స్పష్టంగా ఉండాలి. ఫిర్యాదులపై విచారణ జరగకపోవడం, సర్వేలు ఆలస్యం కావడం, ఉత్తర్వులు అమలు కాకపోవడం వంటి అంశాలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని రికార్డుల ఆధారంగా పరిశీలించాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.



# పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- కరీంనగర్ సీపీ గౌష్ ఆలం
- సవరన్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు
- అమరవీరుల కుటుంబాల సంక్షేమం కోసం దువా

**కాకతీయ, కరీంనగర్:** సమాజ శాంతి, భద్రతల కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరీంనగర్‌లోని సవరన్ మసీదులో సీపీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది క్షేమం, ప్రజా సంక్షేమం కోసం ప్రత్యేక దువా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు యాదగిరిస్వామి, వెంకటస్వామి, విజయకుమార్, టౌన్, ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పోక్సో కేసులో ఏడుగురు అరెస్ట్!

- నిందితులకు జ్యుడీషియల్ రిమాండ్
- డ్రగ్స్ పరీక్షల్లో ప్రతికూల ఫలితాలు
- చేర్యాల సీఐ బానోత్ రమేష్ నాయక్ వెల్లడి



**కాకతీయ, మద్దూర్:** మద్దూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు చేర్యాల సీఐ బానోత్ రమేష్ నాయక్ వెల్లడించారు. బాధితురాలు మైనర్ కావడంతో పాటు, నిందితుల్లో ముగ్గురు మైనర్లు కూడా ఉన్నందున వారి వ్యక్తిగత వివరాలు, గుర్తింపును వెల్లడించే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్నట్లు పోలీసులు తెలిపారు. హుస్నాబాద్ ఏసీపీ సదానందం పర్యవేక్షణలో నిందితులకు ర్యాపిడ్ కిట్ ద్వారా డ్రగ్స్ పరీక్షలు నిర్వహించినట్లు సీఐ పేర్కొన్నారు. పరీక్షల్లో వారు డ్రగ్స్ సేవించినట్లు నిర్ధారణ కాలేదని వెల్లడించారు. మైనర్ల గోప్యతను కాపాడుతూ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు

ముగిసిన చందుర్తి ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్

# విజేతగా బబ్లు టీమ్.. రన్నరప్‌గా తిరుమల్ రెడ్డి జట్టు

- మూడపల్లిలో హోరాహోరీగా క్రికెట్ పోటీలు



**కాకతీయ, చందుర్తి:** వేములవాడ నియోజకవర్గ స్థాయి చందుర్తి ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ మూడపల్లి గ్రామంలో విజయవంతంగా ముగిసింది. హోరాహోరీగా సాగిన పోటీల్లో బబ్లు టీమ్ ప్రథమ బహుమతి సాధించగా, తిరుమల్ రెడ్డి టీమ్ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఇటీవల నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఉత్సాహభరితంగా సాగిన మ్యాచ్‌ల అనంతరం విజేత, రన్నరప్ జట్లను నిర్వాహకులు అభినందించారు. టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన క్రీడాకారులు, నిర్వాహకులు, క్రీడాభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

# జనాభా గణన బ్లాకుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి

- జనాభా గణన–2027 రెండో దశ శిక్షణ పూర్తి
- పకడ్బందీగా గణన, ఉప గణన బ్లాకుల ఏర్పాటు చేయాలి
- అదనపు కలెక్టర్ సంపత్ రావు



**కాకతీయ, ములుగు :** జనాభా గణన-2027లో గణన బ్లాకులు, ఉప గణన బ్లాకులను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు సూచించారు. ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గణన బ్లాకుల ఏర్పాటు, జనాభా గణనలోని 40 ప్రశ్నలు, స్వీయ గణన, సీఎంఎంఎస్ పోర్టల్‌పై నిర్వహించిన రెండురోజుల రెండో దశ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంపత్ రావు గణన ప్రక్రియకు సంబంధించిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని జనాభా గణన సంచాలకుల కార్యాలయ అధికారులు యువేందర్ బాబు, నాయుడు శిక్షణ అందించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్, ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ముఖ్య ప్రణాళిక అధికారి బి. జవహర్ లాల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, గణాంక అధికారులు భూక్యా లాల్ నాయక్, ఎం. రమేష్ బాబు, ఈడీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద తండాలో సీఎం ఆర్ చెక్కుల పంపిణీ

**కాకతీయ, ఇనుగుర్తి :** మండలంలోని పెద్ద తండా గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు భైరా అశోక్ గౌడ్, మాజీ అధ్యక్షులు సతీష్ ఆదేశాలతో మండల పార్టీ ఉపాధ్యక్షులు బానోతు వీరన్న నాయక ఆధ్వర్యంలో శుక్రవారం సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షులు బానోత్ బాలు నాయక్, జిల్లా కార్యదర్శి కాలేరు శివాజీ లతో కలిసి ఈ సందర్భంగా మాట్లాడుతూ బానోతూ లక్ష్మి 16.000, బానోతూ కల్యాణి 36.000 ల చెక్కులను పెద్ద తండ కాంగ్రెస్ పార్టీ ఆవరణలో పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద తండ గ్రామ పార్టీ అధ్యక్షులు బానోతూ బాలు నాయక్, భూక్యా వెంకన్న, గూగులోతు మంగ్య, బానోతు బాలాజీ నాయక్, నారు నాయక్, దేవేందర్ నాయక్, ముని శ్రీకాంత్, భక్స్య, సీతారాం నాయక్, వీరన్న, బాష్యా, గుగూలోతూ సామ్య, పెద్దలు కాంగ్రెస నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రామప్ప పరిరక్షణకు పోరు ఉధృతం

- సింగరేణి ఓపెన్ కాస్టును ఆపాలని కేహెచ్‌టీ డిమాండ్
- ఇప్పటికే కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి పలుమార్లు వినతి
- మంత్రి సీతక్కతో కలిసి రాష్ట్ర ప్రభుత్వంపైనా ఒత్తిడి
- రామప్ప పరిసర ప్రాంత ప్రజలతో కలసి శాంతియుత నిరసనలకు ప్లాన్
- మద్దతు పలికిన బీఆర్ఎస్, బీజేపీలు.. కాంగ్రెస్ పార్టీపై పెరుగుతున్న ఒత్తిడి
- రామప్ప ఆలయానికి ముప్పు తప్పదంటూ ప్రొఫెసర్ పాండు రంగరావు ఉద్ఘాటన
- త్వరలోనే రామప్ప పరిరక్షణకు పాదయాత్ర చేపడుతాం
- పాలంపేట గ్రామ మాజీ సర్పంచ్ రాంమోహన్‌రావు



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిరక్షణ కోసం పోరును ఉధృతం చేయాలని కేహెచ్‌టీ నిర్ణయించింది. దేవాలయానికి ముప్పు కలిగించే అవకాశం ఉందని పేర్కొంటున్న సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే పలుమార్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతులు సమర్పించిన కేహెచ్‌టీ.. రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి రాష్ట్ర ప్రభుత్వంపైనా ఒత్తిడి పెంచేందుకు సిద్ధమవుతోంది. రామప్ప పరిసర గ్రామాల ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేసి శాంతియుత నిరసనలు చేపట్టాలని ప్రణాళిక రూపొందిస్తోంది. రామప్ప దేవాలయ పరిరక్షణే లక్ష్యంగా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నామని కేహెచ్‌టీ ప్రతినిధులు చెబుతున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పలుమార్లు వినతులు సమర్పించినట్లు పేర్కొంటున్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క సహకారంతో రాష్ట్ర ప్రభుత్వంపైనా ఒత్తిడి పెంచాలని భావిస్తున్నారు. దేవాలయ వారసత్వ సంపదకు ఎలాంటి ముప్పు కలగకుండా ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**రాజకీయ పార్టీల మద్దతుతో..**

రామప్ప పరిరక్షణ కోసం సాగుతున్న ఉద్యమానికి బీఆర్ఎస్, బీజేపీలు మద్దతు పలుకుతున్నాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు. దీంతో ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి పెరుగుతోందని చెబుతున్నారు. దేవాలయ పరిరక్షణను రాజకీయాలకు అతీతమైన అంశంగా పరిగణించి అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు. పరిసర గ్రామాల ప్రజలను సమీకరించి శాంతియుత నిరసనల ద్వారా తమ డిమాండ్‌ను బలంగా వినిపించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు కొనసాగితే రామప్ప దేవాలయానికి ముప్పు తప్పదని ప్రొఫెసర్ పాండురంగారావు ఉద్ఘాటిస్తున్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన దేవాలయ పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నారు. ప్రాజెక్టు ప్రభావంపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి దేవాలయానికి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**త్వరలో పాదయాత్ర**

రామప్ప పరిరక్షణ కోసం త్వరలో పాదయాత్ర చేపడతామని పాలంపేట గ్రామ మాజీ సర్పంచ్ రాంమోహన్‌రావు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలను కలుపుకొని శాంతియుత నిరసనలు నిర్వహిస్తామని చెప్పారు. రామప్ప పరిరక్షణ, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు నిలిపివేత డిమాండ్లపై ప్రభుత్వాలు స్పందించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# తహసీల్దార్ సంతకం, ముద్ర ఫోర్జరీ

- నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్‌తో భూముల మ్యుటేషన్‌కు యత్నం!
- కరీమాబాద్ మహిళపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు
- దర్యాప్తు చేపట్టిన ఏజే మిల్స్ కాలనీ పోలీసులు



Office of the Tahsildar, Khila Warangal (M)

Rc.No.C/2913/2026 Dated:17/10/2026

From Sri. Md Iqbal Tahsildar, Khila Warangal

To Station House Officer Police Station, Mills Colony

Sir,

Sub: Revenue Department - Alleged Forgery and use of a Fake Family Member Certificate by Smt. Meherunnisa Begum W/o Late Mohammed Abdul Raheem - Kareemabad Village - Khila Warangal Mandal - Request to file criminal case against the individual - Reg.

Ref:- 1. The Tahsildar, Athmakur, Bhongir District Rc.No. A/437/2026, Dt: 09.10.2026.
2. Fake Family Member Certificate bearing D.Dis.No. C/3223/2026, Dt: 08.01.2026, allegedly obtained in the name of Smt. Meherunnisa Begum.
3. Report of the Mandal Girdawar, Khila Warangal Dt: 09.10.2026.

I invite attention to the reference 1st cited, The Tahsildar Athmakur(M) Bhongir District has requested to verify the genuineness of the Family Member Certificate bearing D.Dis.No. C/3223/2026, Dt: 08.01.2026 said to be issued by Tahsildar, Khila Warangal in the name of Smt. Meherunnisa Begum, W/o Late Abdul Raheem, R/o H.No. 16-1-881, Kareemabad, Khila Warangal, Kareemabad Village, Khila Warangal Mandal, Warangal District.

In this connection, it is to inform that on verification of Office Records and Distribution Register pertains to Year – 2026, it revealed that this office has not issued any Family Member Certificate bearing D.Dis.No.C/3223/2026, dated 08.01.2026, in favour of Smt. Meherunnisa Begum, W/o Late Abdul Raheem, R/o Kareemabad Village, Khila Warangal Mandal and the Family Member Certificate mentioned in reference 1st cited is Tampered and Fake Family Member Certificate.

It is further informed that based on the verification of Family Member Certificate which was forwarded by the Tahsildar, Athmakur, Yadadri Bhuvanagiri District it is clearly established that the family members of the deceased i.e Jainabee, Mohammad Abdul Raheem, Meharunisa Begum, Mohammad Parveen created fake and fabricated family member certificate without mentioning the other and actual family members of the deceased person and trying to mutate the prime agriculture lands with use of fake family member certificate and there is a need to conduct detailed investigation by the Police Department to avoid further fake certificates for different purposes. Further it is also noticed that they also forged signatures of Tahsildar, Khila Warangal and used office seal for creating fake family member certificate.

In view of the above facts, I request to file a criminal case against Smt. Meherunnisa Begum W/o Late Abdul Raheem, R/o 16-1-881, Kareemabad, Khila Warangal and take further action against her under the suitable provisions of law.

Encl: As above

Yours faithfully, Tahsildar, Khila Warangal, Warangal Dist

Copy submitted to the District Collector, Warangal for favour of kind information.
Copy submitted to the Revenue Divisional Officer, Warangal for kind information.

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** భూముల మ్యుటేషన్ కోసం నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించిన వ్యవహారం వరంగల్‌లో వెలుగుచూసింది. ధ్రువపత్రంపై ఖిలా వరంగల్ తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో పాటు నకిలీ ముద్రను ఉపయోగించినట్లు తహసీల్దార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కరీమాబాద్‌కు చెందిన మెహరున్నీసా బేగంపై ఏజే మిల్స్ కాలనీ పోలీసులు నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఎఫ్ఐఆర్ నంబర్ 780/2026తో అక్టోబర్ 17, 2026న రాత్రి 10 గంటలకు కేసు నమోదైంది. ఖిలా వరంగల్ తహశీల్దార్ ఎం.డి. ఇక్బాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 318(4), 336(3), 340(2), 337 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివ రాత్రి మహేష్ దర్యాప్తు చేస్తున్నారు. కరీమాబాద్‌కు చెందిన మెహరున్నీసా బేగం తన భర్త దివంగత మహమ్మద్ అబ్దుల్ రహీం పేరుతో ఉన్నట్లు పేర్కొంటూ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను ఆత్మకూరు తహసీల్దార్‌కు సమర్పించారు. సర్టిఫికెట్ నంబర్ సి/3223/2026, తేదీ 08012026గా ఉంది. దీని ప్రామాణికతపై అనుమానం రావడంతో ఆత్మకూరు తహసీల్దార్ ఖిలా వరంగల్ తహశీల్దార్ కార్యాలయాన్ని వివరణ కోరారు.

**జారీ చేయని ధ్రువపత్రం.. ఫోర్జరీ సంతకం?**

ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులు, పంపిణీ రిజిస్టర్‌ను పరిశీలించగా, 2026లో ఆ నంబరుతో ఎలాంటి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ కాలేదని తేలినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సదరు ధ్రువపత్రం నకిలీదిగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ సంతకం, కార్యాలయ ముద్రను కూడా నకిలీగా ఉపయోగించినట్లు ఫిర్యాదులో వివరించారు. ఇతర వారసుల పేర్లను చేర్చకుండా నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించి, ప్రధానమైన వ్యవసాయ భూములను తమ పేర్లపైకి మ్యుటేషన్ చేయించుకునేందుకు ప్రయత్నించినట్లు తహసీల్దార్ తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో జైనాబీ, మహమ్మద్ అబ్దుల్ రహీం, మెహరున్నీసా బేగం, మహమ్మద్ పర్వేజ్ పేర్లను ప్రస్తావించారు.

**లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

తహశీల్దార్ ఎం.డి. ఇక్బాల్ ఆర్‌సీ నంబర్ సి/2912/2026తో అక్టోబర్ 17న ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ అధికారులకు లేఖ రాశారు. మెహరున్నీసా బేగం (ఇంటి నంబర్ 161881, కరీమాబాద్)పై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ధ్రువపత్రం తయారీ వెనుక మరెవరైనా ఉన్నారా? ఇలాంటి నకిలీ పత్రాలు మరిన్ని సృష్టించారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి!

- డివిజన్ల వారీగా ఎన్నికల బాధ్యుల నియామకం
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



**కాకతీయ, హనుమకొండ:** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేసే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం హనుమకొండలోని అలంకార్ కాకతీయ కాలనీలో తన నివాసంలో మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, ఎన్నికల సన్నద్ధత, నియోజకవర్గ స్థాయి కార్యాచరణపై చర్చించారు. డివిజన్ల వారీగా ఎన్నికల బాధ్యులను నియమించి, పట్టభద్రులను నేరుగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని వినోద్‌కుమార్ సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అర్హులైన వారందరూ ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీఆర్ఎస్‌కు మద్దతు లభిస్తుందని, ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

**ఓటరు నమోదు కేంద్రాల ఏర్పాటు**

మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే డివిజన్ల వారీగా ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 25న ఉదయం 10 గంటలకు ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు, ఎన్నికల సమన్వయకర్తలు, బాధ్యులు, సామాజిక మాధ్యమాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై ఇందులో చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ కుడా చైర్మన్ డాక్టర్ కే. వాసుదేవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలే శ్రేయస్కరం!

- వరి సాగును ఇంటి అవసరాలకే పరిమితం చేయాలి
- తక్కువ నీటితో అధిక లాభాల పంటలపై దృష్టి సారించాలి : కలెక్టర్ స్నేహ శబరిష్



**కాకతీయ, పెద్దవంగర:** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. శుక్రవారం పెద్దవంగర మండలం అవతపురం రైతు వేదికలో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' పక్షోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధిక నీటి వినియోగంతో కూడిన వరి సాగును సొంత కుటుంబ అవసరాలకే పరిమితం చేసుకోవాలని, వాణిజ్య అవసరాల కోసం తక్కువ నీటితో అధిక దిగుబడులు, లాభాలు అందించే ఆరుతడి పంటలు, పప్పుధాన్యాలు, ఉద్యాన పంటలను సాగు చేయాలని కోరారు. భవిష్యత్ తరాల ప్రయోజనాలు, భూమి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రణాళికాబద్ధంగా వ్యవసాయం చేయాలన్నారు. భూసారం పెంచేందుకు సేంద్రీయ ఎరువులు వినియోగించాలని, నీటి లభ్యత ఆధారంగా పంట మార్పిడి పద్ధతులు పాటించాలని సూచించారు. బిందు, తుంపర సేద్య పద్ధతులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధిస్తున్న ఆదర్శ రైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవడం అభినందనీయమన్నారు. గ్రామ సర్పంచ్ తోటకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తూ లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్వామినాయక్, ఏఈఓలు, మహిళా రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

# దుర్గామాత ఊరేగింపులో దాడి.. ఇద్దరికి గాయాలు

- ఐదుగురిపై కేసు నమోదు..
- బాధితుల ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు
- కేశవపట్నం ఎస్ఐ శేఖర్‌రెడ్డి వెల్లడి



**కాకతీయ, శంకరపట్నం:** మండలంలోని తాడికల్ గ్రామంలో దుర్గామాత ఊరేగింపు సందర్భంగా జరిగిన దాడిలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేశవపట్నం పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 21న రాత్రి 10 గంటల సమయంలో దుర్గామాత ఊరేగింపు జరుగుతుండగా, అదే గ్రామానికి చెందిన జనగాం మణికంఠ, బత్తిని సాయి, మొలుగూరి సాయికిరణ్, మొలుగూరి సందీప్, పంజాల వెంకటేష్.. మొలుగూరి హరీష్, మొలుగూరి కృష్ణలపై చేతులతో, చేతి కడెంతో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో హరీష్‌కు కంటి పైన, ముఖంపై గాయాలు కాగా, కృష్ణకు మెడపై గాయమయ్యాయి. బాధితుల తరఫున మొలుగూరి మొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

# వరంగల్ కు రూ.382 కోట్లు..

- ఐదు కీలక ప్రాజెక్టులకు ప్రభుత్వ ఆమోదం
- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కుడా చైర్ పర్సన్ సుధారాణి



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** హైదరాబాద్ తర్వాత వరంగల్ అభివృద్ధే లక్ష్యమని ఇచ్చిన హామీకి అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ కు భారీ నిధులు మంజూరు చేశారని కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి తెలిపారు. వరంగల్ నగర అభివృద్ధి కోసం రూ. 382 కోట్ల అంచనా వ్యయంతో ఐదు కీలక ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ఆమె కుడా, వరంగల్ ప్రజల తరఫున సీఎంకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ కోట కందకాల పునరుద్ధరణ, హనుమకొండ సెంట్రల్ ప్లాజా అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ కమ్ కమర్షియల్ కాంప్లెక్స్, వేయి స్తంభాల గుడి పరిసరాల అభివృద్ధి, మ్యూజికల్ గార్డెన్ ఏర్పాటు ఈ ప్రాజెక్టులతో వరంగల్ చారిత్రక వైభవం నిలుస్తూనే, పర్యాటక, వాణిజ్య, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆమె పేర్కొన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ సత్య శారదలకు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన



**కాకతీయ, చేర్యాల:** విద్యార్థులకు పోలీసుల విధులు, బాధ్యతలు, పోలీస్‌స్టేషన్‌లో జరిగే ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అపూర్వ రెడ్డి ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు పోలీసుల విధులు, ప్రజలకు అందించే సేవలను వివరించారు. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందినప్పటి నుంచి దానిపై చేపట్టే చర్యలు, ఫిర్యాదుల స్వీకరణ, దర్యాప్తు తదితర ప్రక్రియలను సులభంగా అర్థమయ్యేలా వివరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది సేవలను స్మరించుకుంటూ వారికి నివాళులర్పించారు. పోలీస్‌స్టేషన్‌లోని వివిధ విభాగాలు, పోలీసుల బాధ్యతలు, ప్రజలకు అందించే సేవలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పోలీసు శాఖ పనితీరుపై అవగాహన పెంపొందించడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.

## పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి భరోసా

- శనిగరం సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య



**కాకతీయ, కోహెడ:** పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కళ్యాణలక్ష్మి పథకం ఎంతో గొప్పదని శనిగరం గ్రామ సర్పంచ్ లింగంపల్లి లక్ష్మయ్య అన్నారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ పథకం ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా నిలుస్తూ, కుటుంబాలకు ఊరటనిస్తోందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి పథకాన్ని అమలు చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తాము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు పేద కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతున్నాయని లక్ష్మయ్య అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుచ్చయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామపంచాయతీ అధికారి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలు చేస్తే చర్యలు

- నిద్రమాత్రలు, మత్తు కలిగించే మందుల అమ్మకాలపై నిఘా
- నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సుల రద్దు : ఎస్సై నరేష్ హెచ్చరిక

**కాకతీయ, ఇనుగుర్తి:** వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా నిద్రమాత్రలు, మత్తు కలిగించే మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నరేష్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరిష్ ఆదేశాల మేరకు శుక్రవారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని మెడికల్ దుకాణాల్లో ఎస్సై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల యజమానులకు పలు సూచనలు చేశారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా నిద్ర మాత్రలు, మత్తు కలిగించే మందులను విక్రయించరాదని స్పష్టం చేశారు. యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాల బారిన పడకుండా నిరోధించేందుకే తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే లైసెన్సుల రద్దుతోపాటు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266